విత్తనాలను నేరుగా విత్తుకోవాలి

పొత్తూరులో రైతుకు సూచనలు చేస్తున్న ఏఈవో లతాశ్రీ

ఇల్లంతకుంట, డిసెంబర్ 16 : రైతులు పొలాన్ని దమ్ము చేసి వరి విత్తనాలను విత్తుకోవడం వల్ల అధిక లాభాలు వస్తాయని ఏఈవో లతాశ్రీ సూచించారు. శనివారం మండలంలోని పొత్తూరు వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి రైతులకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ, రైతులు వరి నారు మడులు పోసుకుని నాటు వేయడం కంటే పొలాన్ని దమ్ము చేసుకుని నేరుగా వరి విత్తనాలు చల్లడం వల్ల విత్తన ఖర్చు తగ్గడంతోపాటు కూలీల అవసరం రాదన్నారు. పంట కోత సమయం పది రోజులు ముందుగా వస్తుందన్నారు. విత్తనం ఖర్చు తగ్గడంతోపాటు వరి పంట కోత సమయం తగ్గుతుందన్నారు. రైతులు వీలైనంత వరకు ఈ పద్ధతిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మెరిట్ ఆధారంగా అభ్యర్థుల భర్తీ

- డీపీఆర్వో మామిండ్ల దశరథం

కలెక్టరేట్, డిసెంబర్ 16 : రాజన్న సిరిసిల్ల జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపాదికన సిబ్బందిని భర్తీ చేసేందుకు వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన అభ్యర్థులను మెరిట్ ఆధారంగా పౌర సంబంధాల అధికారి కార్యాలయం వద్ద లిస్టును ఏర్పాటు చేస్తామని శనివారం డీపీఆర్వో మామిండ్ల దశరథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనుమతితో ఒక ఏపీఆర్వో పోస్టుకు సంబంధించిన 1:5 నిష్పత్తిలో, ఒక పబ్లిసిటీ అసిస్టెంట్ (ఫొటోగ్రాఫర్) పోస్టుకు ముగ్గురు మాత్రమే అర్హత సాధించడంతో వారి వివరాలను ఐడీఓసీలోని నోటీస్ బోర్డుపై వివరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక వీడియో గ్రాఫర్ పోస్టుకు రెండు దరఖాస్తులు రాగా వారికి కావాల్సిన విద్యార్హత లేదని తెలిపారు. మెరిట్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 18 సాయంత్రం 5 గంటల వరకు డీపీఆర్వో కార్యాలయంలో తెలియజేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, వాటికి సంబంధించిన సమయం, తేదీలు, వేదికలను తెలియజేస్తామని తెలిపారు.

గంభీరావుపేటలో కొండూరి పర్యటన

గంభీరావుపేట, డిసెంబర్ 16: మండల కేంద్రంలో శనివారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పర్యటించారు. వివాహ వేడుకలకు హాజరై దంపతులను ఆశీర్వదించారు. పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బొందుగుల రాకేశ్ వివాహ వేడుకకు హాజరై దంపతులను ఆశీర్వదించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పాపగారి లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉద్యోగి వజార్‌అలీ కుటుంబాలను కొండూరి పరామర్శించారు. వీరితో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపగారి వెంకటస్వామిగౌడ్, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, గంధ్యాడపు రాజు, చెవుల మల్లేశం, లింగంయాదవ్, వహీద్, ఎగదండి స్వామి తదితరులు ఉన్నారు.

జిందం కళ దంపతులకు సత్కారం



చైర్‌పర్సన్ జిందం కళ దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 16: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో అఖిల భారత పద్మశాలీ అన్నసత్రం ఆధ్వర్యంలో శనివారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవం జరిగింది. అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి దంపతులు హాజరు కాగా నిర్వాహకులు వారిని శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, యాదగిరి గుట్ట ప్యాట్రన్ చిలువేరు కాశీనాథ్, అధ్యక్షుడు చెరుపల్లి యాదగిరి, సిరిసిల్ల పద్మశాలీ కల్యాణ భవనం అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు కట్టెకోల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్టేట్ మీట్

ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన స్పోర్ట్స్, గేమ్స్ స్టేట్ మీట్ పోటీలు శనివారంతో ముగిశాయి. 23 జిల్లాల పాఠశాలల నుంచి 83 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు జడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణ బహుమతులను అందించారు. ఇక్కడ ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ కదిరె రజిత, తదితరులు ఉన్నారు.

-ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 16

నైపుణ్యం పెంపొందించేందుకే శిక్షణ తరగతులు

- జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్

శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్

కలెక్టరేట్, డిసెంబర్ 16 : గ్రామీణ ప్రాంతాల్లో కిశోర బాలికల జీవన నైపుణ్యాలను పెంపొందించడానికి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాధికారి రమేశ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆయన శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం కిశోర బాలికలు, మహిళలకు ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టిందన్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినులు ఆధునిక ప్రపంచంతో పోటీ పడేలా జీవన నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ అవకాశాన్ని కిశోర బాలికలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీ రాజం, సీడీపీవో సుచరిత, జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ పద్మజ, రోజా, డీసీపీవో స్వర్ణలత, ఎస్వో స్వప్న, సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

గురువుల పాత్ర వెలకట్టలేనిది

మాట్లాడుతున్న మోటివేషన్ స్పీకర్ తిరుపతి

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 16: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, గురువుల పాత్ర వెలకట్టలేనిదని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, సర్టిఫైడ్ లైఫ్ స్కిల్స్ ట్రైనర్ తిరుపతి అన్నారు. తంగళ్లపల్లి మండలం తాడూరు ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్య సాధనకు నిరంతరం కఠోరంగా శ్రమించాలని వివరించారు. ప్రస్తుత సమాజంలో సామాజిక మాధ్యమాల ప్రభావం విద్యార్థులు, యువతపై విపరీతంగా ఉందని, దాని బారి నుంచి విద్యార్థులను బయటకు తీసకువస్తే, యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందన

ఇల్లంతకుంట, డిసెంబర్ 16 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బంగారు పథకానికి ఎంపికవడంపై ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. శనివారం రాష్ట్ర పునరుత్పాదక శక్తి వనరుల కేంద్రం హైదరాబాద్‌లో ఎనర్జీ క్లబ్స్ ఇన్ స్కూల్స్ విభాగంలో బంగారు పథకానికి ఎంపికైనట్లు ప్రకటించారు. గత సంవత్సరం పాఠశాలలోని ఆదిత్య హర్నిస్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన విద్యుత్ ఆదా విధానం, పునరుత్పాదక శక్తి వనరులపై అవగాహన నిర్వహించినందుకు ఈ అవార్డు వచ్చిందని ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, నోడల్ అధికారి మహేశ్ చంద్ర అన్నారు. దీనిపై స్థానిక సర్పంచ్ కూబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యతోపాటు పలువురు నాయకులు అభినందించారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి రూ.10 వేల విరాళం అందజేస్తున్న ఎర్రం రాజేందర్

రుద్రంగి, డిసెంబర్ 16 : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన ఎర్రం రాజేందర్ శనివారం రూ.10 వేలను విరాళంగా అందజేశాడు. గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇక్కడ స్వాములు చెలుకల తిరుపతి, మంచె రాజేశం, అట్టెపెల్లి మల్లేశం, ఎర్రం శ్రీనివాస్, అయ్యప్ప స్వాములు ఉన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ముద్రకోల అర్చన

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 16: గొల్లపల్లికి చెందిన ముద్రకోల అర్చన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అనిల్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. డిసెంబర్ 25 నుంచి 30 వరకు తమిళనాడులోని తిరుచిరాపల్లిలో సదరు పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 16: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న సిరిసిల్లలో మెన్ అండ్ ఉమెన్ క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, సెక్రటరీ బొజ్జ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లోఎంపికైన వారిలో 32 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని చెప్పారు. ఉదయం 6.30 వరకు స్థానిక మినీస్టేడియం వద్దకు రావాలని సూచించారు. వివరాలకు 9440852285లో సంప్రదించాలని కోరారు.

చిరుత దాడిలో దుడ్డె మృతి

ఇల్లంతకుంట, డిసెంబర్ 16 : మండలంలోని వెల్జీపూర్ గ్రామంలో బొల్లారం నాగరాజు అనే రైతుకు చెందిన దుడ్డెపై చిరుత పులి దాడి చేయగా మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. రైతు శనివారం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా 2 సంవత్సరాల వయస్సు ఉన్న దుడ్డెపై దాడి చేసి కొంత మేరకు తిని వదిలేసి వెళ్లిందని తెలిపారు. దుడ్డె దాదాపు రూ.25 వేల విలువ ఉంటుందని రైతులు పేర్కొన్నారు. అటవీ అధికారులు స్పందించి రైతుకు తగిన నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. రైతులు చిరుతల బెడద లేకుండా చేయాలని కోరారు.

22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 16: తంగళ్లపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న నిర్వహిస్తున్నామని ఎంపీడీవో లచ్చాలు తెలిపారు. ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. సభ్యులు, సంబంధిత శాఖాధికారులు హాజరు కావాలని కోరారు. 30 గ్రామాల్లోని సర్పంచులకు ఆత్మీయ సత్కారం ఉంటుందని తెలిపారు. సర్పంచులు తప్పనిసరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా ఎన్నికైన ఎడమల శ్రీధర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 16: తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో అధ్యక్షుడిగా ఎడమల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీరాముల రాంచంద్రం, గడ్డం శ్రీనివాస్, పొత్తూరి రాజు, ప్రధాన కార్యదర్శిగా అంతడుపుల ఝాన్సీ, సహాయ కార్యదర్శులుగా గడ్డం దేవయ్య, గుగ్గిళ్ల పరశురాం, పూడూరు సంజీవ్, కోశాధికారిగా గణేశ్, కార్యవర్గ సభ్యులుగా లావణ్య, కిన్నెర, శ్రీలత, శిరీష ఎన్నికయ్యారు.